ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుపై 5శాతం రాయితీ

అంబర్‌పేట: ముందస్తు ఆస్తిపన్ను చెల్లించే వారికి ఎర్లీబర్డ్ స్కీమ్‌తో 5 శాతం రాయితీ కల్పిస్తోంది. ఈనెల చివరి నాటికి ముందస్తూ ఆస్తి పన్ను చెల్లిస్తే ఆస్తిపన్నులో 5 శాతం రాయితీ పొందవచ్చని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతీదివాకర్ గురువారం తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గంలో రూ.29కోట్ల మేర ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఉన్నారని అన్నారు. వారిలో ఇప్పటి వరకు ఎర్లీబర్డ్ స్కీంను పలువురు సద్వినియోగం చేసుకుని రూ.6 కోట్లు చెల్లింపు చేశారన్నారు. ఈ నెల చివరి నాటికి ఈ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకుని 5శాతం ఆస్తి పన్నులో ఆదా చేసుకోవాలని ఆయన సూచించారు. ఆస్తి పన్ను చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



హనుమాన్ జయంతి శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్లు

ముషీరాబాద్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రాంనగర్ శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను గురువారం సాయంత్ర ఆవిష్కరించారు. శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం నవీన్ ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రియానవీన్‌గౌ, అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సలహాదారుడు తూడుం రాజు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌యూవీఎస్‌కు దరఖాస్తు చేసుకోండి



ముషీరాబాద్ వార్డు ఆఫీసులో దరఖాస్తులను అందజేస్తున్న యువత

ముషీరాబాద్: రాజీవ్ యువ వికాస్ పథకం (ఆర్‌యూవీఎస్) కింద నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, ఎంబీసీ, మైనార్టీ యువత రుణం పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్ కోరారు. యువతీ యువకులు తమ దరఖాస్తులను స్థానిక వార్డు కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ఈ పథకం కింద స్వయం ఉపాధి కోసం రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు ఇస్తారని గురువారం ఆయన తెలిపారు. ఈనెల 14 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–15లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

చిక్కడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని గురువారం కార్యకర్తలకు సూచించారు. గురువారం సాయంత్రం డివిజన్‌లోని వీవీగిరి నగర్, దోబీఘాట్, అరుంధతీనగర్, అన్నానగర్, వాల్మీకినగర్ బస్తీలలో ఆమె బస్తీ బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, ఉమేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



కమల్ (ఫైల్)

ముషీరాబాద్: మతిస్థిమితం సరిగా లేని ఓ యువకుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లి దండ్రులు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాంనగర్ మేడి బావి బస్తీకి చెందిన సంతోష్ అలియాస్ కమల్(34)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. గత వారం రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ, శివాజీనగర్ ప్రాంతానికి చెందిన వెంకటేష్ (55)కు ఫైనాన్స్ వ్యాపారంలో తీవ్ర నష్టం వచ్చింది. మరోవైపు అప్పులు పెరిగిపోవడంతో అప్పుల బాధను తట్టుకోలేక మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10-15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎన్.సైదిరెడ్డి



వేణుగోపాల్, సునీతలు స్లాట్‌బుకింగ్‌ను పరిశీలిస్తున్న చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ ఎ.మల్లిఖార్జున్

చిక్కడపల్లి: చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంటేషన్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10–15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యిందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎన్.సైదిరెడ్డి అన్నారు. ప్రభుత్వం 22 పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రయోగాత్మకంగా తీసుకొచ్చిన ఈ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవంతం అయ్యిందని తెలిపారు. ఎవరి మీద ఆధారపకుండా ఆన్‌లైన్‌లో తప్పులను సరి చేసుకోవచ్చాని పేర్కొన్నారు. గురువారం చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ ఎ.మల్లికార్జున్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. మొత్తం స్లాట్ ద్వారా 19 బుకింగ్ చేశామన్నారు. అందులో 16 రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు. ఆన్‌లైన్ కాకుండా సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు టోకెన్ పద్ధతిలో 5దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో మూడింటికి రిజిస్ట్రేషన్ పూర్తయ్యిందని తెలిపారు. మొత్తం 19రిజిస్ట్రేషన్లు పూర్తి చేశామన్నారు.

స్లాట్ రిజిస్ట్రేషన్ బాగుంది

స్లాట్ బుకింగ్ ద్వారా సమయం వృథాకావడం లేదు. 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. ఎవరి మీద ఆధారపకుండా డాక్యుమెంట్లు ఉంటే ఆన్‌లైన్‌లో కరెక్షన్లు చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన ఈ ప్రాజెక్టు బాగుంది.

– స్వర్ణకుమారి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు



తొందరగా అయ్యింది..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ అయ్యింది. స్లాట్ బుక్ చేసిన తర్వాత జాప్యం లేకుండా తొందరగా పని అయ్యింది. తిలక్‌నగర్‌లో ఉండే నేను నా భార్యతో కలసి మార్ట్‌గేజ్ లోన్ పెట్టుకున్నాం. త్వరగా రిజిస్ట్రేషన్ కావడం సంతోషంగా ఉంది.

– వేణుగోపాల్, తిలక్‌నగర్

ఈ పద్ధతి బాగుంది

తొందరగా రిజిస్ట్రేషన్ కావడం మా లాంటి వృద్ధులకు ఇబ్బందులు ఉండవు. చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సేల్ డీడ్ చేశాను. ఎంతో సమయం ఆదా అవుతోంది. ప్రభుత్వం, అధికారులు మంచిపనే చేశారు.

– పుష్పవతి, బాగ్‌లింగంపల్లి



బీసీ హాస్టళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలి

- స్థలాలు కేటాయిస్తే కేంద్రం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ హాస్టళ్ల సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. బీసీ సంక్షేమ సంఘం చేసిన వేలాది ఉద్యమాల ఫలితంగా రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ ద్వారా 325 బీసీ కాలేజీ హాస్టళ్లను నిర్వహిస్తున్నారని తెలిపారు. వాటిలో ఇప్పటి వరకు ఒక్క హాస్టల్‌కు కూడా సొంత భవనం లేదన్నారు. హాస్టళ్లు ప్రారంభించి ఐదు దశాబ్దాలవుతున్నా ఒక్క దానికి కూడా సొంత భవనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కేవలం బీసీ హాస్టళ్లకు మాత్రమే ఈ దుస్థితి ఉందన్నారు. ఏటా కోట్ల రూపాయలు అద్దె కింద ఖర్చు చేసే ప్రభుత్వం సొంత భవనాలు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కాలేజీ హాస్టళ్ల నిర్మాణానికి స్థలాలు సేకరించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. బాలికల హాస్టళ్లకు 80శాతం, బాలుర హాస్టళ్లకు 60శాతం గ్రాంట్ ఇస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపిందన్నారు.

వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ



వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీతో యూనియన్ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని బుధవారం జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డి.సంజీవరెడ్డి ప్రకటించారు. సలహాదారులుగా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్, వీఎస్‌టీ మాజీ కార్మికులు కె.రాజయ్య, ముఖ్యఉపాధ్యక్షులుగా జి.నగేష్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ సమాద్, ఎం.రణదీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్‌డీ పాల్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఏఆర్. శ్రీనివాస్‌యాదవ్, అసిస్టెంట్ కార్యదర్శులుగా ఎన్.నవీన్‌బాబు, ఆర్.విజయేందర్, ప్రచార కార్యదర్శిగా ఏ.వెంకట్‌రెడ్డి, సహాయ ప్రచార కార్యదర్శిగా పి.రామ్‌మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.ప్రభాకర్, సహాయ నిర్వహక కార్యదర్శిగా ఎం.సాయిప్రసాద్‌రెడ్డి, కోశాధికారిగా డి.కృష్ణరెడ్డి, క్యాంటీన్ సెక్రటరీగా పి.వినోద్‌కుమార్‌లను నియమించినట్లు తెలిపారు. నూతన కమిటీ పదవి కాలం రెండేళ్ల పాటు ఉంటుందన్నారు. ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తానని ఆయన చెప్పారు.

గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ డిమాండ్



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో కట్టెల పొయ్యి, గ్యాస్ సిలిండర్ పెట్టి నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

చిక్కడపల్లి: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గురువారం సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో కట్టెలపొయ్యి, గ్యాస్ సిలిండర్ పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... కేంద్రం గ్యాస్ సిలిండర్ పై రూ.50 పెంచి ప్రజల మీద రూ.3700 కోట్ల భారం వేసిందన్నారు. పెట్రోలియం ఉత్పత్తులపై స్పెషల్ సర్‌చార్జ్ వేసి రూ.37వేల కోట్ల భారం వేసిందని ఆరోపించారు. పెంచిన వంట గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ విధానాలు పేదలను కొట్టి కార్పొరేట్ గద్దలకు వేసినట్టుగా ఉందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాక ముందు రూ.380 ఉన్న సిలిండర్ ఈరోజు రూ.905 పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పని కూడా దొరకని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రేటర్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, కమిటీ సభ్యురాలు టి.జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు డీజీ నర్సింహారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ్, కె.నాగలక్ష్మి, ఆర్.వెంకటేష్, కుమారస్వామి, మారన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనితర సాధ్యం.. కానూరి వ్యంగ్యం



కానూరు వెంకటేశ్వర్‌రావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న సతీష్‌చందర్

ముషీరాబాద్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, విప్లవ సాంస్కృతిక ఉద్యమ కళారంగ యోధుడు కానూరు వెంకటేశ్వరరావు వర్ధంతి సభను విద్యానగర్ మార్క్స్ భవన్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు పి.వేణు, ప్రొ. వినయ్‌బాబు కానూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ సంపాదకుడు, కవి సతీష్‌చందర్ మాట్లాడుతూ.. ప్రజానాడి పట్టుకున్న కానూరి వ్యంగ్యం అనితర సాధ్యమని అన్నారు. కానూరి వెంకటేశ్వర్‌రావు రచనలు అనునిత్యం ప్రజలను ఆలోచింపజేసే విధంగా ఉంటాయని పేర్కొన్నారు. నాలుగో తరగతి కూడా చదవని కానూరి నాలుగు తరాలకు తన బుర్ర కథలు, పాటలు, పద్యాలు, వ్యంగ్య నాటకాల ద్వారా సమాజాన్ని తీవ్ర స్థాయిలో ప్రభావితం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్, ఆయన కుమార్తె బేబీ, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయగిరి, మల్లన్న, ప్రధాన కార్యదర్శి దాసు తదితరులు పాల్గొన్నారు.

అక్షర చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలి



ధర్నాచౌక్‌లో మాట్లాడుతున్న శాసనసభ పక్షనేత, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కవాడిగూడ: దేశంలో పెరిగిపోతున్న సైబర్ సెక్యూరిటీ మోసాల కంటే చిట్ ఫండ్, ఫైనాన్స్ కంపెనీల మోసాలే పెరిగిపోతున్నాయని సీపీఐ శాసనసభ పక్షనేత, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో గురువారం అక్షర చిట్‌ఫండ్ బాధితులు ధర్నా నిర్వహించారు. బాధితుల ధర్నాకు మద్దతుగా ఎమ్మెల్యే కూనంనేని హాజరై మాట్లాడారు. తెలంగాణలో చిట్‌ఫండ్ పేరుతో వేయికోట్లు మోసం చేసిన పేరాల శ్రీనివాసరావు, పేరాల శ్రీవిద్యపై ప్రభుత్వం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలకు అధిక వడ్డీ ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్న చిట్‌ఫండ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఉపా లాంటి చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఇలాంటి చిట్‌ఫండ్ మోసాలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలి రావాలి



ముషీరాబాద్: నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు 27న వరంగల్ రజతోత్సవ బహిరంగ సభకు భారీగా తరలి రావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నియోజకవర్గ ముఖ్య నేతలతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, కొండా శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్, వల్లాల శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్‌ఎస్ రజతోత్సవంలో భాగంగా ఈ నెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అయిలినేని కిషన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. వారు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పేదలకు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముషీరాబాద్: ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు సమష్టిగా కృషి చేయాలని హరియాణా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి సూచించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా అడిక్‌మెట్ డివిజన్ టీఆర్‌టీకాలనీలోని పోలింగ్ బూత్ 230 పరిధిలోని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఇంటి వద్ద పార్టీ వేడుకలను ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా రాంనగర్ మీసేవ వద్ద పార్టీ జెండాను డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణ యాదవ్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ జెండాను ఆవిష్కరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, నాయకులు పూసరాజు, మోహన్, నరేష్, రామారావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఇంటిపై జెండాను ఆవిష్కరిస్తున్న బండారు విజయలక్ష్మి

నేడు అయ్యప్పస్వామి పూజ

నల్లకుంట: హరిహర సుతుడు అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం (నేడు) నల్లకుంట శంకరమఠం ప్రధాన రహదారిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా ఉన్న టీస్టాల్ వద్ద అయ్యప్ప పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురుస్వామి జడాపూర్ బుగ్గప్ప నేడొక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.45 గంటలకు పూజ ప్రారంభమవుతుందని, పూజ అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని చెప్పారు. నల్లకుంట గురుస్వాముల ఆధ్వర్యంలో జరిగే పూజలో కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అన్ని పార్టీల నాయకులను ఆహ్వానించామని చెప్పారు.

బీసీ నేత పంజాబ్‌రావుకు నివాళి



కాచిగూడ: బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఉద్యమించిన పంజాబ్‌రావు దేశ్‌ముఖ్ ఆశయాల సాధన కోసం బీసీలందరూ సంఘటితంగా ఉద్యమించాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని పిలుపునిచ్చారు. గురువారం నారాయణగూడలో మాదరబోయిన నర్సయ్య అధ్యక్షతన పంజాబ్‌రావు దేశ్‌ముఖ్ 51వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంజాబ్‌రావు దేశ్‌ముఖ్ రాజ్యాంగ సభ్యుడిగా ఉండి బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు కల్పించడం లేదని సభను నిలదీశారని పేర్కొన్నారు. జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండు అంజయ్య, నేతాజి, ఎంబీ గోపి, కేవీ శ్రీధర్, వి.చంద్రయ్య, సి.పరమేశ్వరి, సవిత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



చంద్రశేఖర్ (ఫైల్)

నల్లకుంట: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఆత్మకూరుకు చెందిన మేడి చంద్రశేఖర్(50) జీవనోపాధి కోసం మూడేళ్ల క్రితం నగరానికి నల్లకుంటలో భార్యాబిడ్డలతో ఉంటున్నాడు. ఈనెల 7న భార్య, కుమారుడు వేర్వేరుగా పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. 8వ తేదీన రాత్రి 10గంటలకు ఇంటికి వచ్చిన వారికి చంద్రశేఖర్ కనిపించలేదు. అతడు పనిచేసే మెడికల్ షాప్ వద్దకు వెళ్లి విచారించగా ఆ రోజు మధ్యాహ్నం షాపు నుంచి వెళ్లిపోయాడని తెలుసుకున్నారు. ఆందోళనకు గురైన అతడి కుమారుడు మేడి రాహుల్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆమోదం వెనుక కేంద్రం హస్తం

కాచిగూడ: రాజ్యాంగ నిబంధనలు పాటించని తెలంగాణ ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్ర గవర్నర్ ఆమోదించడం వెనుక కేంద్ర ప్రభుత్వ హస్తం ఉందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా. బీఎల్ రాజు ఆరోపించారు. గురువారం నారాయణగూడలోని మాల మహానాడు కార్యాలయంలో సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, సంకు శ్రీనివాసులు, జేఎన్ రావులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మాలజాతికి వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్, బీజేపీలను బొందపెట్టాలని మాల సమాజానికి ఆయన పిలుపునిచ్చారు.

ఆరోగ్యమిత్ర కె.అనూజకు రూ.లక్ష ఆర్థికసాయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆరోగ్యమిత్ర కె.అనూజ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేసినట్లు ఆరోగ్యశ్రీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య తెలిపారు. చికిత్స పొందుతున్న అనూజను గురువారం పరామర్శించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరోగ్య మిత్రులందరూ తమకు తోచిన విధంగా ఆర్థిక సాయం చేయడం ఆదర్శనీయమని అన్నారు. అంతేకాకుండా ఆరోగ్య శ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈఓను కలిసి అనూజ పరిస్థితిని వివరించామన్నారు. అందుకు ట్రస్ట్ సీఈఓ స్పందించి తగిన సహకారం అందించాల్సిందిగా ట్రస్ట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అందుకు ఆరోగ్య మిత్రుల తరఫున సీఈఓకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఎవరికైనా ఇలాంటి ప్రమాదాలు జరిగితే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో తక్షణమే పొందే విధంగా చూడాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర నాయకులు మహేందర్, సుమన్, నాగరాజు, మహేష్, కాటమయ్య, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలి

సైబర్‌క్రైమ్ ఏసీపీ కేవీఎం ప్రసాద్



వాకథాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న సైబర్‌క్రైమ్ ఏసీపీ, పీఎన్‌బీ ప్రతినిధులు

కవాడిగూడ: సైబర్ క్రైమ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ కేవీఎం ప్రసాద్ సూచించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ 131వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఇందిరా పార్కులో సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై అవగాహన కల్పించేందుకు వాకథాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ చుగ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

పెన్షనర్ల బకాయిలు ఏపీ ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

చిక్కడపల్లి: పెన్షర్లకు రావాల్సిన కరువు, వేతన సవరణ బకాయిలను ఏపీ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ నేతలు డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో 5వ సర్వసభ్య సమావేశం జరిగింది. సీఎంఎఫ్‌ఎంఎస్ సైట్‌లో పెన్షనర్‌కు సంబంధించిన మొబైల్ నంబర్ అప్డేట్ చేయాలని ఖజానా శాఖ సంచాలకులను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెల్త్ కార్డులకు ఇన్సూరెన్స్‌ను లింకప్ చేసి సత్వరమే ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుచ్చి రాజు వార్షిక నివేదికను చదివి వినిపించారు. కోశాధికారి రంగాచార్యులు ఈ ఏడాది (24 –25 సంవత్సర) జమా ఖర్చులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూర్యప్రకాష్, డి.సుధాకర్, రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నేత బుచ్చిరాజు, డా.సూర్యాప్రకాష్